**శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్**
**నవ్య వీక్లి సంయుక్త నిర్వహణ కథల పోటీలో**
**తృతీయ బహుమతి రూ. 5,000**
**పొందిన కథ**

# విశ్వమానవుడు

**సింహప్రసాద్**

చికాగో మహానగరంలో విమానం దిగి నేల మీద అడుగు పెడుతోంటే ఒడలు పులకరించింది.

ఇది నూట పదేళ్ళ క్రిందట వివేకానందుడు అడుగుపెట్టిన పుణ్యగడ్డ – అన్న భావన నన్ను నిలువునా కుదిపేసింది.


ఎక్కడి కన్యాకుమారి మరెక్కడి చికాగో!

హిందు మత ప్రతినిధిగా భారతీయ వేదాంతం గురించి యావత్ప్రపంచానికి తెలియజెప్పాలన్న మహత్తర లక్ష్యంతో జేబులో రూపాయిలేకుండా ఇక్కడి కొచ్చిన ధీశాలి ఆయన!

"హమ్మో! ఎయిర్‌పోర్ట్ ఎంత పెద్దదో చూడండి..."

నా భార్య రమ అంది.

"అదేం గొప్పకాదు గాని స్వామీ వివేకానంద సర్వమత సమ్మేళనంలో పాల్గోటానికి ఇక్కడికే వచ్చారు. పాశ్చాత్య దేశస్థుల్ని సోదరీ సోదరమణులారా అని సంబోధించి సమ్మోహన పరిచింది ఇక్కడే..."



"అలాగా!" చుట్టూ మరింత విస్మయంగా చూస్తూ అంది.

ఆ నేల ఆ గాలి ఏదో పరమార్థం చెబుతున్నట్టు అనుభూతికి లోనైంది.

"కన్యాకుమారిలోని విగ్రహమూ, సముద్రంలోని ఆ కొండ, దాని మీద ధ్యాన మందిరం గుర్తొస్తున్నాయండీ..."

"రియల్లీ గ్రేట్ మేన్. ఆయన సమర్థత సంకల్పబలం సత్యనిష్ఠ అనితర సాధ్యం!"

వీసా చెక్కింగులూ లగేజ్ స్కానింగులూ అయ్యాయి.

సూట్‌కేసుల్లోని పచ్చళ్ళూ తినుబండారాలు చెక్కింగు అధికారుల దృష్టిలో పడనందుకు రమ పొంగిపోయింది.

కనెక్టింగ్ ఫ్లైట్‌కి లగేజీ హేండోవర్ చేసి చెరో హేండ్ లగేజ్ ఈడ్చుకుంటూ మా గేట్ దగ్గరికెళ్తోంటే ఒక విదేశీయుడు పలకరించాడు.

"మే ఐ హెల్ప్ యూ" అంటూనే చొరవగా రమ బ్యాగ్ అందుకున్నాడు.

రమ చీరవంక అభినందన పూర్వకంగా చూస్తూ "యూ ఆర్ లుకింగ్ గ్రేట్. యువర్ ఇండియా ఈజ్ గ్రేట్. యువర్ తాజ్‌మహల్ ఈజ్ గ్రేట్" అన్నాడు.

నా భుజాలు ఉప్పొంగాయి. "యస్. అవర్ కల్చర్ ఈజ్ గ్రేట్. అవర్స్ ఈజ్ ద ఓల్డెస్ట్ ఇన్ ద వరల్డ్. డూ యూ నో అవర్ వేదాస్ గీత.."

"ఐ నో కిషన్..."

"యస్. కృష్ణ... హీ ఓన్లీ ప్రీచ్‌డ్ గీత. గాడ్స్ వరడ్స్ ఆర్ రెలవెంట్ ఈవెన్ టు డే టు ఆల్ పీపుల్ ఆఫ్ ఆల్ కంట్రీస్..."

అతగాడి కెంతఅర్థమైందో తెలీదుగాని పది నిమిషాలపాటు ఏకధాటిగా దంచేశాను.

అతడు మా పరిచయం కలిగినందుకు సంతోషంగా వుందన్చెప్పి బ్యాగ్ రమ కిచ్చి మరో ప్రక్క కెళ్ళిపోయాడు.

''అక్కడి పిల్లల బుర్రలు తినడం చాలదా ఇక్కడా ఉపన్యాసాలిస్తున్నారూ!''

''జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి అన్నారే. జన్మభూమిని తలచుకుంటే చాలు నా గుండెలు ఉప్పొంగిపోతాయి. అలాటి పుట్టినగడ్డకి దూరం కాకూడదురా అని నెత్తీనోరూ కొట్టుకున్నాను. నీ కొడుకు తలకెక్కితే కదా!''

''రేపట్నుంచి అబ్బాయి మెదడు తింటారు కాబోలు. ఇదిగో ఇప్పుడే చెబుతున్నాను. వాడు బాధ పడేట్టు ఒక్క మాటన్నా నేను వూరుకోను...''

''వూరికే నేను మాత్రం ఎందుకంటానే పిచ్చి దానా!''

''మీ మాట కాదని అమెరికా వచ్చాడని మీకు కోపం. గ్రీన్ కార్డ్‌కి అప్లై చేశాడని తెలిసినప్పట్నుంచి 'ఆ'లూ 'వూ'లూ తప్ప మాటలే లేవుకదా!''

''సరి సర్లే. ఇదిగో ఇదే మన గేట్...''

చెక్కిన్ అయ్యాం.

చార్లెట్ వెళ్లే విమానంలో కూర్చున్నామన్న మాటేగాని నా ఆలోచనలు మాత్రం వెంకట్ చుట్టూతే తిరుగుతున్నాయి.

మా అబ్బాయి అని చెప్పడం కాదు గాని వెంకట్ చాలా తెలివైనవాడు. లెక్కలంటే ఎంతిష్టమో చెప్పలేను. ఐఐటి గురించి నాకు తెలీదుగాని వాడు తెలుసుకున్నాడు. మద్రాసు ఐఐటీలో సివిల్ ఇంజినీరింగ్ చదివాడు.

ఎన్నోచక్కని ఉద్యోగాలు వెదుక్కుంటూ వచ్చాయి. వాటిని త్రోసిరాజని ఎమ్మెస్ చేస్తానంటూ అమెరికా వచ్చాడు. గ్రాడ్యుయేట్ ఎస్సిస్టెన్స్‌షిప్ తెచ్చుకున్నాడు. నేను ఒక్క రూపాయి పంపలేదు. పై ఖర్చులకు ఏం తిప్పలు పడ్డాడో తెలీదు గాని ఏడాదిన్నరలోనే ఎమ్మెస్ పూర్తి చేశాడు.

''ఇప్పుడైనా మన దేశం వచ్చెయ్యరా'' అన్నాను.

''సారీ నాన్నా. ఇక్కడ పరిశోధనలకి అవకాశాలు పుష్కలంగా వున్నాయి. అందుకని... పీహెచ్‌డీలో చేరాను..''

వాడి తిక్కకుదర్చాలని సాంప్రదాయ కుటుంబంలోని గాయత్రినిచ్చి పెళ్లి చేసాను. రాత్రీ పగలూ పోరుపెట్టి అయినా వాడ్ని ఇండియాకి లాక్కొచ్చేస్తుందని ఆశపడ్డాను. ప్చ్. అమెరికా వచ్చాక తనూ 'తందానతాన' అయిపోయింది!

గ్రీన్‌కార్డ్‌కి అప్లై చేసినట్టు చెప్పాడు. డాలర్ల వేట మోజులో పడ్డాడని అర్థమైంది. ఇక మన దేశానికి తిరిగిరాడని తెలిసిపోయింది.

నానా దుర్భాషలాడాను. మా కడుపున చెడబుట్టావన్నాను. నీ మొహం చూడనుగాక చూడను – అని కూడా అనేశాను.

ఇది జరిగి ఏడేళ్ళు పైనే అయ్యింది. డాక్టరేట్ రావడం ప్రముఖ పరిశోధనా సంస్థలో శాస్త్రవేత్తగా చేరడం జరిగిపోయాయి.

మనవరాలు పుట్టింది. రమ్మన్నారు. వెళ్ళలేదు. వాళ్ళు రాలేదు.

వారానికోసారి మాత్రం ఠంచనుగా ఫోన్ చేస్తారు. రమతో కబుర్లు చెబుతారు. నా గురించడుగుతారు. బిజీగా వున్నానని చెబుతుంది. కారణమేమిటో వాళ్ళకీ తెలుసు నాకు తెలుసు.

''అమెరికా చూద్దురుగాని రండి'' అని మొదట్లోనూ, ''మనవరాలిని చూద్దురు గాని రండి'' అని ఆ తర్వాత కొడుకు కోడలూ కోరుతూ వచ్చారు. ఈ మధ్య మనవరాలు కూడా ఆ పాట అందుకుంది.

''తర్వాతొస్తాం'' అంటూ వాయిదా వేస్తూ వచ్చాం.

ఏడాది నుంచి రమ పోరు ఎక్కువయ్యింది. ''మీరిలాగే భీష్మించుకూర్చుంటే నేనొక్కదాన్నీ వెళ్ళిపోతాను'' అని బెదిరించే దాకా వచ్చింది.


''వాడే పెళ్లాం బిడ్డల్తో రావచ్చుగా. పసి దానికి ఇండియా చూపించొచ్చుగా!'' అనే వాడ్ని.

నాలుగు నెలల క్రితం నాకు హార్ట్ ఎటాక్ వచ్చింది. వారం రోజులు ఆసుపత్రిలో వుండాల్సొచ్చింది.

''ఇంట్లోని ఫోన్ లిఫ్ట్ చెయ్యట్లేదేవిటి? అంతా ఓకేనా?'' అంటూ కొడుకూ కోడలూ గొడవ పెట్టారు. నిజం చెబితే కంగారు పడతారని బంధువులింటి కెళ్ళమని అబద్ధమాడాం. వాళ్ళు నమ్మినట్లు లేరు. మమ్మల్ని అమెరికా రమ్మంటూ ఒత్తిడి మాత్రం పెంచారు.

''రోజూ అబ్బాయి కలలో కొస్తున్నాడండీ. వాడ్ని చూసి ఏళ్ళు అయిపోయాయి'' అంది రమ కళ్ళ నీళ్ళు పెట్టుకుని.

మనవరాలిని చూడాలని, తనకి చందమామ కథలు విన్పిం



చాలన్న కోరిక నాలో మొలకెత్తింది. నా గుండె బల హీనపడిందని తెలిసిపోయింది గనుక ఇంకో ఎటాక్ రాకముందే అందర్నీ చూసి రావాలని బలంగా అన్పించింది.

రమతో చూచాయిగా చెప్పేనంతే. వెంటనే వీసా క్కావల్సిన ఏర్పాట్లు చేసేశాడు వెంకట్. ఆ పైన విమానం టిక్కెట్లు పంపేశాడు.

అదంతా నెమరువేసుకుంటూ నాకు తెలీకుం డానే నిట్టూర్చాను.

చిత్రంగా చూస్తూ అంది "మీకు బొత్తిగా రావా లని లేదు కదూ? నా పట్టు మీదే వచ్చారు కదూ?"

"నిజంగానే రావాలన్పించిందే. డాలర్లు తింటూ డాలర్ల గాలి పీలుస్తూ డాలర్లలో నిద్రపో తున్న నీ కొడుకు వైభోగం చూడాలన్పించింది".

"మీ ఎత్తిపొడుపు మాటలింక కట్టి పెట్టండి. అబ్బాయి వింటే బాధ పడతాడు. ఎక్కడున్నా వాళ్ళు సుఖంగా వుంటే అంతేశానా!"

"నిజమెప్పుడూ నిష్ఠూరంగానే వుంటుంది మరి. వాడీ దేశాన్ని పట్టుకుని వ్రేలాడుతోంది డాలర్ల కోసమే కదా. కారే రాజులు రాజ్యముల్ కల్గవే – అని చిన్నప్పుడు చదివిన పద్యాన్ని గుర్తు తెచ్చుకుంటే బావుణ్ను..."

"మిమ్మల్ని కదిపేకన్నా తేనె తుట్టిమీద రాయి వెయ్యడం మంచిది" మొహం తిప్పేసుకుని విండో లోంచి మేఘాల వంక సీరియస్‌గా చూస్తుండిపో యింది.

నవ్వుకున్నాను. "తిన్నాక రుచి ఎలా వుందో నువ్వే చెబుతావులే".

చార్లెట్‌లో విమానం దిగాం. లగేజీ లాంజ్ వెదు క్కుంటూ వెళ్ళేసరికి అబ్బాయీ అతడి మిత్రుడు మా లగేజీ కలెక్ట్ చేసుకుని ఎదురొచ్చారు.

"ప్రయాణం బాగా సాగిందా నాన్నా" వెంకట్ మాటలకి తలాడించాను.

"అలా చిక్కిపోయావేంట్రా" అంది రమ వాడి బుగ్గలు పుణుకుతూ.

తల్లికళ్ళ కలా కన్పించొచ్చుగాని నిజానికి మా అబ్బాయి కాస్త ఒళ్ళు చేశాడు. పొడుగైనట్టూ వున్నాడు. హుందాగా ఉత్సాహంగా వున్నాడు. మమ్మల్నిచూసి ఏనుగెక్కినంత సంబర పడ్డాడు.

మిత్రుడ్ని పరిచయం చేశాడు.

"మీరొస్తున్నారని తెలిసినప్పట్నుంచీ రోజూ మీ గురించే చెబుతున్నాడు అంకుల్..." అన్నాడతడు.

"ఓ..... నువ్వూ ఆంధ్రా వాడివేనా? గుడ్. ఏ ఊరు బాబూ?"

"శ్రీకాకుళం. ఇక్కడికొచ్చేక ప్రాంతాలూ రాష్ట్రాలూ గుర్తుండవంకుల్. ఇండియన్ అయితే చాలు ప్రాణం లేచొస్తుంది"

రెండు కార్లలో ఇంటికెళ్ళాం.

సుమారు అయిదెకరాల పచ్చని మైదానం మధ్యలో పొందిగ్గా వుంది ఇల్లు. చుట్టూ పూలవనం ఆపైన పెద్దపెద్ద చెట్లు. చూడముచ్చటగా వుంది.

## విశ్వమానవతా భావన



ఇది కథానికా శత జయంతి సంవత్సరంలో కథ లకుగాను లభించిన ఏడవ బహుమతి. నవ్య సంపాదకు లకూ, న్యాయ నిర్ణేతలకు నా ప్రత్యేక కృతజ్ఞతాంజలి. గత మే నెలలో అమెరికా వెళ్లడం జరిగింది. వివిధ దేశాలకు చెందిన వారిని అక్కడ కలిశాను. పరి శీలించాను. వారి వారి సంస్కృతుల పరిరక్షణా యత్నాలు గ్రహించాను. విభిన్న రంగాలలో అద్భుత విజయాలు సాధిస్తున్న వారి గురించి విన్నాను. యువతలో ముఖ్యంగా పరిశోధనా రంగంలోని వారి 'ఏదో సాధించాలన్న తపన, విశ్వమానవతా భావన' నన్ను కదిలించింది. వీటన్నిటి అక్షర రూపమే ఈ కథ.


**–సింహప్రసాద్**

**401, మయూరీ ఎస్టేట్స్,**

**ఎం.ఐ.జి.-2-650,**

**కెపిహెచ్‌బి కాలని, హైదరాబాద్-72**

**సెల్: 9849061668**


కోడలు ఎదురొచ్చి పాదాభివందనం చేసింది.

వేడి వేడి కాఫీ త్రాగుతూ "మనవరాలేది గాయత్రీ" అడిగాను.

"స్కూలు కెళ్ళిందంకుల్. ఇంకో మూడు గంటల్లో వచ్చేస్తుంది. మీరీ లోగా స్నానాదులు ముగించి కాస్సేపు నడుం వాలుద్దురు గాని. ఫ్లైట్‌లో సరిగా నిద్రపోయారో లేదో...!"

వెంకట్ ఫ్రెండ్ వెళ్ళడానికుద్యుక్తుడవుతూ అన్నాడు "వచ్చేవారం మా కంపెనీలో పార్టీ వుందంకుల్. గవర్నర్ వస్తున్నారు. దానికి మీరి ద్దరూ తప్పకుండా రావాలి. అప్పుడు మళ్ళీ కలుద్దాం".

అతడెళ్ళేక, "మీ హెల్త్ ఎలా వుంది నాన్నా. వీక్‌గా వున్నారు. షుగర్ వుందేమో టెస్ట్ చేయిం చారా" అడిగాడు వెంకట్.

"వయసైపోతోంది కదా ఏవోటి వస్తూంటాయి. మనం చేసిన పుణ్యకార్యాలు శాశ్వతం గాని మనం అశాశ్వతం కదా!" కావాలనే వ్యంగ్యంగా అన్నాను.

చివ్వున తలెత్తాడు. కోడలేదో అనబోతే కళ్ళతోనే వారించాడు.

"గాయత్రీ! నీకిక్కడెలా వుందమ్మా. ఆడపిల్లకీ వరి మొక్కకీ రెండు జన్మ లంటారు. పుట్టినిల్లూ మెట్టిని ల్లూనూ. నీకేమో మూడు జన్మలైనట్టుంది కదూ!"

నవ్వేసింది. అందరికీ దూరంగా బిక్కుబిక్కు మని బతుకుతున్నామన్న దిగులే లేదు. వట్టి డబ్బు మనుషులు!

చాటంత మొహం చేసుకునొస్తూ అంది రమ "ఇదిగో ఈ ఫొటో చూడండి.."

"వినాయకుడి విగ్రహం. చవితికి కొనుం టారు".

"సరిగ్గా చూడండి. కొనడానిక్కాడా అమ్ము తారా చోద్యం గాకపోతే! కోడలు పిండితో చేసిం దండీ. ఎంత చక్కగా వుందో చూడండి.."

తీర్చిదిద్దిన తొండం చెవులు బొజ్జ కళ్ళు... 'అచ్చు' వేసినంత గొప్పగా వుంది.

మనస్పూర్తిగా అభినందించాను. గాయత్రి పొంగి పోయింది.

అబ్బాయి ఆఫీసుకెళ్ళిపోయాడు. కోడలు కారు తీసుకెళ్ళి నయనని స్కూలు నుంచి తీసుకొచ్చింది.

ఆరేళ్ళ నయన బుట్టబొమ్మలా వుంది. ముద్దు లొలుకుతూ వుంది.

నన్ను ప్రథమంగా చూస్తోన్నా ఎంతో పరిచయ మున్నట్టు "తాతయ్యా" అంటూ వచ్చి నా చేతుల్లో వాలిపోయింది.

"నీ పేరేంటి చిట్టితల్లీ..."

"నయన. నీ పేరు ఆనందరావు. నానమ్మ పేరు రమ..."

"అబ్బో! నా బంగారుతల్లికి అన్నీ తెలుసే. ఫోన్లో నీ మాటలు విని చిలుక పలుకులనుకున్నాను గాని తెలుగుబాగానే మాట్లాడుతున్నావే".

"నా మనవరాలా మజాకా! నా దగ్గరికి రా తల్లీ..."

నా చేతుల్లోంచి రమ చేతుల్లోకి దూకింది.

ఎన్ని ముద్దులు ఎన్ని ముచ్చట్లు ఎన్నెన్ని కబుర్లు! నయన గంటల్ని నిమిషాలుగా మార్చే స్తోంది!

"నిన్ను ఇండియాకి తీసుకెళ్ళిపోదామనే వచ్చాం నయనా. మీ మమ్మీడాడీ ఇక్కడుంటే వుండనీగాని నువ్వొచ్చేసెయ్ మన దేశం వెళ్ళి పోదాం".

"వింటర్ హాలిడేస్‌లో ఇండియా చూపిస్తానని డాడీ ప్రామిస్ చేశారు. మీ ఇల్లూ మీ ఊరు గోదా వరి అన్నీ చూస్తాను తాతయ్యా".

"గోదావరి కూడా తెలిసిందే" ఆశ్చర్యబోతూ అన్నాను.

కళ్ళు తిప్పుతూ అంది. "డాడీ ఎన్ని కథలూ కబుర్లూ చెబుతారో! గోదావరి మీద కాటన్ డ్యామ్ కట్టేడు కదా. అందుకని అక్కడ పండే ప్రతి గింజ మీదా ఆయన నేమ్ వుంటుందని డాడీ చెప్పేరు".

"అవి చెప్పేడుగాని మన దేశం గురించి చెప్పలే దన్న మాట. ప్రపంచం విశాలమైందే. మనిషి ఎద గాల్సిందే. ఎంత ఎదిగినా దేశం ముందు ఒదిగి వుండాల్సిందే. ఇండియా మన మాతృభూమి. వెళ్ళి పోదాం. చూడటానిక్కాదు ఏకంగా అక్కడే వుండి పోడానికి!"

కించిత్తు విస్మయంగా చూసింది "యూనో గ్రాండ్ ఫా. అయామ్ యాన్ అమెరికన్ సిటిజెన్. ది సీజ్ మై కంట్రీ..."

పెనుకెరటం బలంగా నా మొహాన్ని తాకింది.

తుళ్ళిపడి చూశాను. అపనమ్మకంగా చూశాను. బాధగా చూశాను.

ఎక్కడ పుడితే ఆ దేశపు వారవుతారన్నది నిజమే అయినా ఎందుకో జీర్ణించుకోలేకుండా వున్నాను.

''మీ డాడీ మంచి మాటలే నేర్పించాడు!'' పెడసరిగా అనేసి అక్కడ్నుంచి లేచి వచ్చేశాను.

ఒక రోజున మా అందర్నీ గుడికి తీసుకెళ్ళాడు వెంకట్.

హిందూ దేవుళ్ళందరూ వున్నారు.

భారతదేశపు అన్ని ప్రాంతాల వారు వచ్చారు. వారిలో గుజరాతీలెక్కువగా వున్నారు. అంతా సంప్రదాయ దుస్తులు ధరించారు. వారి భక్తి శ్రద్ధలు చూసి పులకించిపోయాను.

మర్నాడు ''తాతయ్యా'' అంటూ ల్యాప్‌టాప్ తీసుకొచ్చి నా ప్రక్కన చతికిల బడింది నయన. చకచకా ఆపరేట్ చేసింది.

''నానమ్మా! నువ్వురా...''

''వస్తున్నా తల్లీ'' అంటూ వచ్చి కూర్చుంది రమ.

యూ ట్యూబ్‌లో ప్రత్యక్షమైంది నయన.

కళ్ళు, తల, చేతులు తిప్పుతూ వేమన పద్యాలు, సుమతీశతకం, ఓం జయ జగదీశహరే, హనుమాన్ చాలీసా... వరుసగా చక్కగా తప్పుల్లేకుండా చెప్పింది చిన్నారి పొన్నారి నయన.

ఎందరో విద్యార్థుల్ని తీర్చిదిద్దిన మాస్టర్నే అయినా విస్తుపోకుండా వుండలేక పోయాను.

అమెరికాలో పుట్టిపెరిగిన నయన తెలుగు హిందీ భాషల్లో వున్న వాటి భావాన్ని తెలుసుకుని మరీ చెప్పటం...!

''ఓహ్! అమోఘం! అద్భుతం!''

నయనని గుండెలకి హత్తుకున్నాను. ముద్దులు పెట్టాను. కళ్ళ నుంచి ఆనంద భాష్పాలు జలజల రాలిపోతోంటే మనస్ఫూర్తిగా అభినందించాను. ఆశీర్వదించాను.

ఎనిమిదో తరగతి చదువుతోన్న మా అమ్మాయి కొడుకు సుమంత్‌కి బొత్తిగా తెలుగురాదు. వారి స్కూల్లో తెలుగులో మాట్లాడితే శిక్షిస్తారట. మా అమ్మాయి కూడా తన కొడుక్కి తెలుగస్సలు రాదని గొప్పగా చెబుతూంటుంది.

అలాంటిది...!

''నువ్వు అమెరికన్‌వి అయినా మా సంస్కృతీ సంప్రదాయాలు బాగా వంట బట్టించుకున్నావు నయనా''.

''తనలో ప్రవహిస్తోన్నది భారతీయ రక్తమే. తన జీన్స్‌లో వున్నది అక్కడి సంస్కృతి మూలాలే కదా అంకుల్''.

కోడలి మాటలకి నాకు తెలీకుండానే తబ్బిబ్బు పడ్డాను.

''అవన్నీ ఎవరు గుర్తుంచుకుంటున్నారూ. వేళ్ళని మరచిపోతున్న రోజులివి!'' గాయత్రితో అని, నయనతో ''నువ్వు మాత్రం బాగా గుర్తుపెట్టుకో చిన్నితల్లీ. సర్వే జనాః సుఖినోభవంతు, లోకాస్సమస్తా సుఖినోభవంతు అంటుంది భారతీయ సంస్కృతి. మనం బాగుంటే చాలదు. అందరూ బాగుండాలి... ప్రపంచమంతా బాగుండాలి...'' అన్నాను.

తప్పట్లు కొట్టింది నయన. ''పరోపకార్థం ఇదం శరీరం...''

ఆ చిన్నారి సమయస్ఫూర్తికి అబ్బురపడకుండా వుండలేక పోయాను.

''నువ్వు వండర్ గర్ల్‌వి.... గాయత్రీ! నీ పెంపకం అమోఘం. దేశం కాని దేశంలో వుంటున్న మన మూలాల్ని మర్చిపోలేదు. వేద విజ్ఞానాన్నీ మర్చిపోలేదు...''

''ఇందులో మీ అబ్బాయి కృషి చాలా వుందంకుల్. ఆయన్లానే ఇదీ ఏకసంథాగ్రాహి''

ముఖం తిప్పేసుకున్నాను.

రెండ్రోజుల తర్వాత వెంకట్ వాళ్ళ కంపెనీవారి పార్టీకి అందరం వెళ్ళాం.

వెంకట్ ఫాదర్నని తెలుసుకుని చాలామంది షేక్‌హేండిచ్చి మరీ నన్ను అభినందించారు. భారతీయులు నమస్కరించారు.

మా వాడు తన కంపెనీలో మంచిపేరు తెచ్చుకున్నందుకు గర్వంగా ఫీలయ్యాను.

కంపెనీ ఎండీ ఉపన్యాసం వింటూనే మ్రాన్పడిపోయాను.

వెంకట్ కాంక్రీట్ కన్నా గట్టిదీ మన్నికైనదీ అయిన మిశ్రమాన్ని కనుక్కొని డాక్టరేట్ పొందాట్ట! ఈ కంపెనీలో చేరాక అహోరాత్రులూ తపస్సుచేసి తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఆనకట్టలు నిర్మించే డిజైన్ తయారు చేశాట్ట! దాని వల్ల ప్రపంచంలోని ప్రతి నదిమీదా ఎన్నో ఆనకట్టలు నిర్మించి లక్షల కోట్ల ఎకరాలని సస్యశ్యామలం చెయ్యచ్చుట. ఈ కృషికి గాను అంతర్జాతీయ అవార్డు లభించిందిట. వెంకట్‌ని అభినందించడానికే ఈ పార్టీ అరేంజ్ చేశార్ట!

ఆనందోద్వేగుడ్నై వెంకట్ వంక చూశాను.

వాడు నా బిడ్డగా కాదు ఒక ఋషిలా కన్పించాడు.

వాడ్ని అక్కున చేర్చుకోవాలన్పించింది. ఆగలేక అటుగా అడుగులేశాను.

సరిగ్గా అప్పుడు గవర్నర్ మెమెంటోని వెంకట్‌కి అందివ్వబోతోంతే, ''నా ఈ స్థితికి కర్త కర్మ క్రియ మా నాన్నగారే. వారి బోధనలే నన్నింతటివాడ్ని చేశాయి. వారితో కలిసి దీన్నందుకోవాలన్నది నా కోరిక'' అన్నాడు వెంకట్.

''మిస్టర్ ఆనందరావ్...''

బిగ్గరగా పిలిచారు. తప్పట్లు మార్మోగాయి.

నా కళ్ళకెవరూ కన్పించట్లేదు. ఆకాశమంత ఎత్తుకెదిగిన నా పుత్రుడు తప్ప!

*

కవిత

## ఎలా నీకు ముఖం చూపను

అనాథ కర్ణుడికి
అండగా నిలిచి
అంగరాజుని చేసిందే
నాలుగు అటుకులు తెచ్చినందుకు
కుచేలుడ్ని కూడా
కుబేరుడ్ని చేసిందే
ఏమీ నా చెలికాడు
నాలుగు ఆత్మీయ చినుకుల్ని
నాపై చల్లలేని
దయలేని మేఘమయ్యేడా
ఎప్పుడు తప్పిన పిలుపు వచ్చినా
తప్పుడు పిలుపుగానే
తల్లడిల్లిపోతాను
అర్థంలోనే
పరమార్థం చూసే
చెలికాని చేష్టకి
విలవిల లాడతాను
అప్పటిదాకా వున్న
ప్రేమ బంధం
పిసినారి గాలి
పుటుక్కున తెంచేస్తున్నట్టు
చెలిమి నీడలాంటిది
గొడుగులాంటిది
అన్న భావనలు
గాలిలో దూది పింజలైనట్టు
నాలుగు ఆత్మీయ రూకలు
చేయని చెలిమి
చెల్లని సత్తురూపాయిగా మిగిలినట్టు
ఒక్కసారిగా
ఆదారం తెగిన
గాలిపటమవుతాను
పేలిన
గాలి బుడగనవుతాను
నిస్సత్తువగా
కూలిబడిపోతాను
ఇప్పటిదాకా
విలువకట్టలేనిదనుకున్నానుగాని
విలువలేని దయ్యిందా
అయ్యో నా చెలిమీ
ఎలా నీకు ముఖం చూపను



**-బద్ది నాగేశ్వరరావు**